నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
10 | నిజామాబాద్ మంగళవారం 10 జూన్ 2025 | ADILABAD NIRMAL



# గోపీనాథ్ అకాల మరణం పార్టీకి తీరనిలోటు

గోపీనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, నాయకులు

**మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, జూన్ 9 : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, హైదరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ అకాల మరణం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో గోపీనాథ్ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అజయ్, రావుత్ మనోహర్, సాజిదుద్దీన్, యూనీస్ అక్బానీ, ప్రహ్లాద్, ప్రకాశ్, గంద్రత్ రమేశ్, కుమ్ర రాజు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఇందిరమ్మ ఇండ్ల కౌంటర్ వద్ద ఫిర్యాదుదారులు

# అనర్హులకు అందలం

- ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో అక్రమాలు
- కమిటీ సభ్యులకు నచ్చిన వారికి ఇండ్లు
- డబ్బుల డిమాండ్.. ఇష్టానుసారంగా పంపిణీ
- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

ఆదిలాబాద్, జూన్ 9(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ప్రక్రియ గందరగోళంగా మారింది. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని, అన్ని విధాలుగా అర్హులుగా ఉన్న తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని పేదలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. తాము అర్హుల జాబితాలో ఎంపికైనా ఇందిరమ్మ కమిటీ సభ్యులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, పైసలు ఇవ్వకపోతే వారికి నచ్చిన వారిని, అనర్హులను ఎంపిక చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అధికారులు తాము సూచించిన వారిని కాకుండా జాబితాలో పేర్లు లేని వారిని ఎంపిక చేస్తున్నారంటూ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఫిర్యాదులు చేస్తున్నారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పేదలు ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

## కిరాయి ఇంట్లో ఉంటున్నం



ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందలో అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయంటూ మహిళలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమ పేర్లు అర్హుల జాబితాలో ఉన్నా కమిటీ సభ్యులు ఇతరులకు ఇండ్లు ఇచ్చారు. కూలీ చేసుకుంటూ ఉపాధి పొందుతున్నామని, తమలో కొందరికీ భర్తలు లేరని, ప్రతి నెల రూ.1000 చెల్లిస్తూ కిరాయి ఇంట్లో ఉంటున్నామన్నారు. ఎలాంటి ఆధారం లేని వారిని కాదని భూములు ఉన్న వారికి ఇండ్లు వచ్చాయని, తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

## కమిటీ సభ్యులు పైసలు అడుగుతున్నరు..



తమ గ్రామంలో 11 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైతే అర్హుల జాబితాలో ఉన్న నలుగురి పేర్లను కమిటీ సభ్యులు తొలగించి ఇతరులు పేర్లు చేర్చారని తలమడుగు మండలంలోని ఉండం గ్రామానికి చెందిన పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కమిటీ సభ్యులు రూ.50 వేలు, రూ.30 వేలు డిమాండ్ చేశారని, అర్హులుగా ఉన్న శీల, దుర్గమ్మ, వాణీ, జైనాభీల పేర్లు జాబితా నుంచి తొలగించినట్లు తెలిపారు. నాలుగు గుంజలు వేసి ప్లాస్టిక్ కవర్లు అడ్డంగా కట్టుకుని వాటిలో నివాసం ఉంటున్న తమకు ఇండ్లు రాలేదని, నివాస స్థలం లేని వారికి ఇండ్లు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.



## భూములు ఉన్న వారికి ఇండ్లు ఇచ్చారు

పూరి గుడిసెల్లో కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందేవారికి కాకుండా వ్యవసాయ భూములు ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారంటూ నేరడిగొండ మండలంలోని కుమారికి చెందిన గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమకు ఇండ్లు ఎందుకు రాలేదని ఇందిరమ్మ కమిటీ సభ్యులను అడిగితే రెండో జాబితాలో మీకు ఇండ్లు వస్తాయని చెబుతున్నారన్నారు. అర్హులుగా ఉన్న తమకు ఇండ్లు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## లబ్ధిదారుల ఎంపికపై విచారణ జరపాలి



మా గ్రామంలో ఆరుగురుకి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్హులుగా ఉన్న వారిని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. అధికారులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరించి అర్హులను కాకుండా అనర్హులను ఎంపిక చేశారు. నా భార్య రేణుకబాయి పేరిట ఇళ్లు మంజూరైంది. ఈ ఇంటిని రద్దు చేసి ఇతరులకు కేటాయించారు. నాకు జరిగిన అన్యాయం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడానికి 60 కిలోమీటర్లు దూరం నుంచి మా బంధువుల మోటార్ సైకిల్‌పై వచ్చా. మా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

- దూదిరాం, శ్యాంనాయక్ తండా, ఉట్నూర్ మండలం



# ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి బ్రేక్

## గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉందంటూ ఇరిగేషన్ శాఖ అడ్డంకులు

- 1,335 ఎకరాల్లో చేతికొచ్చిన మొదటి విడుత పంట
- ప్రస్తుతం ప్రీ యూనిక్ కంపెనీ ఆధ్వర్యంలో కొనుగోళ్లు
- అశ్వరావుపేట ఫ్యాక్టరీకి తరలింపు.. రాజకీయ ఒత్తిళ్లతోనే గందరగోళం



కోతకొచ్చిన ఆయిల్ పామ్ గెల

నిర్మల్, జూన్ 9(నమస్తే తెలంగాణ) : సోన్ మండలంలోని పాక్‌పట్ల వద్ద నిర్మించ తలపెట్టిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ బ్రేక్ వేసింది. ఈ ఫ్యాక్టరీ నిర్మించే స్థలం గోదావరి పరీవాహక ప్రాంతానికి సంబంధించి ఫ్లడ్ లెవెల్ పరిధిలో ఉన్న కారణంగా ఇరిగేషన్ శాఖ అధికారులు నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్(ఎన్‌వోసీ) జారీ చేయలేదు. ఇప్పటికే ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి పొల్యూషన్ బోర్డుతోపాటు ఇతర రకాల అనుమతులు లభించాయి. కేవలం ఇరిగేషన్ శాఖ అనుమతి రాకపోవడంతో ఏడాదిన్న నుంచి పరిశ్రమ పనులు మొదలు కావడం లేదు. భవిష్యత్‌లో కూడా ఎన్‌వోసీ జారీ అయ్యే అవకాశం కనిపించడం లేదు. దీంతో ప్రీ యూనిక్ కంపెనీ ప్రత్యామ్నాయ స్థల అన్వేషణలో ఉన్నట్లు సమాచారం. నిర్మల్ జిల్లాలో స్థలం లభించనట్లయితే సరిహద్దులో ఉన్న నిజామాబాద్ జిల్లాలో పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుతం మొదటి దశలో సాగు చేసిన ఆయిల్ పామ్ దిగుబడి చేతికిరావడంతో పంటను ప్రీ యూనిక్ కంపెనీ డిసెంబర్ వరకు కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. ఆయిల్ పామ్ రైతులందరికీ కంపెనీ నుంచి ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేస్తున్నారు. ఈ కార్డు కలిగి ఉన్న రైతులకు ఉద్యానవన శాఖ ద్వారానే కాకుండా ప్రీ యూనిక్ కంపెనీ ద్వారా ప్రయోజనాలను అందించనున్నారు. ఇందులో భాగంగా దిలావర్‌పూర్, లోకేశ్వరం మండల కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ఈ పంటను ఖమ్మం జిల్లాలోని అశ్వరావుపేట ఫ్యాక్టరీకి తరలించనున్నారు.

### 1,335 ఎకరాల్లో మొదటి దశ దిగుబడి

మొదటి దశ కింద 1,335 ఎకరాల్లో దిగుబడి రానున్నది. ఎదిగిన



సారంగాపూర్ మండలంలో ఏపుగా పెరిగిన ఆయిల్ పామ్ మొక్కలు

మొక్కల వయసును బట్టి ఎకరానికి రెండు టన్నుల వరకు దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే దాదాపు 100 ఎకరాల కొనుగోళ్లు పూర్తయ్యాయి. టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.20 వేలు ప్రీ యూనిక్ కంపెనీ చెల్లిస్తున్నది. పంటను విక్రయించిన రైతులకు వారం నుంచి పది రోజుల్లో డబ్బులను చెల్లించనున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో దిగుబడిని ప్రీ యూనిక్ కంపెనీ కొనుగోలు చేస్తుందో? లేదో? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రస్తుతం పరిశ్రమ నిర్మాణం నిలిచిపోవడంతో ఇప్పటికే సాగు చేస్తున్న రైతుల్లో అయోమయం నెలకొనగా, కొత్త రైతులు సాగుకు ముందుకు రావడం లేదని చెబుతున్నారు.

### కేసీఆర్ ప్రభుత్వం కృషి

రైతులను లాభాల బాట పట్టించడమే కాకుండా, ప్రత్యామ్నాయ సాగు వైపు దృష్టి సారించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించింది. ఆయిల్ పామ్ సాగుకు ముందుకొచ్చిన రైతులకు అనేక సబ్సిడీలతోపాటు డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాన్ని కల్పించింది. నాలుగేళ్లపాటు నిర్వహణ, ఎరువుల కోసం ఎకరానికి రూ.4200 చొప్పున అందించింది. అంతేకాకుండా జిల్లా రైతులకు అందుబాటులో ఉంచేందుకు సారంగాపూర్ మండలం బీరవెల్లి వద్ద పెద్ద ఎత్తున నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. దీంతో నిర్మల్ జిల్లాలో భారీ సంఖ్యలో తోటలను పెంచేందుకు ముందుకొచ్చారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 8,200 ఎకరాల్లో మొక్కలను పెంచుతున్నారు. పరిశ్రమ నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఇవ్వడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పరిశ్రమ పనులు నిలిచాయి.

### కంపెనీ యాజమాన్యానికి నోటీసులు

ప్రస్తుతం ఫ్యాక్టరీ నిర్మించ తలపెట్టిన పాక్‌పట్ల గ్రామ స్థలం గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. పొల్యూషన్ బోర్డుతోపాటు ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన అనుమతులు లభించడంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణ స్థలం నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో ఇరిగేషన్ శాఖ సర్వే నిర్వహించి ఈ స్థలం గోదావరి ఫ్లడ్ లెవెల్ పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ శాఖ ఎన్‌వోసీని జారీ చేయలేదు. అలాగే ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీని నిర్మించవద్దంటూ కంపెనీ యాజమాన్యానికి నోటీసులు కూడా జారీ చేసింది. ఈ క్రమంలో పరిశ్రమ ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, అటు కేంద్రంలో ఉన్న బీజేపీ నాయకులు జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, పరిశ్రమ ఏర్పాటుకు చొరవ చూపకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫ్యాక్టరీ విషయంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పరస్పరం విమర్శించుకోవడం గందరగోళానికి కారణమవుతున్నది.

# తిండి మెతుకులపై రాజకీయమా?

- జొన్నల డబ్బులను ఖాతాలో జమ చేయాలి
- మాజీ మంత్రి జోగు రామన్న



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జూన్ 9 : రైతుల వద్ద నుంచి జొన్నలను కొనుగోలు చేసి నేటి వరకు వారి ఖాతాలో డబ్బులు జమ చేయక పోవడంతో రైతు కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. రైతుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సోమవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులతోపాటు పేద, మధ్య తరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. అలాగే పేద, మధ్య తరగతి కుటుంబాలకు అందించే రేషన్ బియ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిక్కుమాలిన రాజకీయాలు చేయడం పరిష్కారం కాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరోనా విపత్కర పరిస్థితుల్లో ఒకే ఫింగర్ ప్రింట్‌పై కుటుంబాలకు బియ్యం అందజేయడం జరిగిందని గుర్తు చేశారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను తీవ్రంగా ఇబ్బందికి గురి చేయడమే కాక తినే తిండి మెతుకులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లెక్కలు తేల్చుకోవడం సిగ్గు చేటని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి రేషన్ సరుకులతోపాటు రైతాంగానికి సహకరించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట మార్కెట్ మాజీ చైర్మన్‌లు మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, బట్టు సతీశ్, దమపాల్ కొండ గణేశ్, ఉగ్గే విఠల్ ఉన్నారు.

# గాలి, దుమారం బీభత్సం

*ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం గాలి, దుమారం బీభత్సాన్ని సృష్టించింది. పలు చోట్ల చెట్లు విరిగిపడగా, ఇండ్లలో రేకులు లేచిపోయాయి. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రాష్ట్రస్థాయి హకీ పోటీలను ప్రారంభించడానికి ఎంపీ నగేశ్, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు హాజరయ్యాయి. కార్యక్రమ ప్రారంభంలో గాలి, దుమారం కారణంగా స్టేజీపైన, కింద ఉన్న కుర్చీలు చెల్లా చెదురయ్యాయి. గాలి, దుమారం నుంచి తప్పించుకునేందుకు ఎంపీతోపాటు ఇతరులు పరుగులు తీయాల్సి వచ్చింది.* - ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



పరుగులు తీస్తున్న ఎంపీ నగేశ్



కూలిన వేదిక



అడెల్లు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# అమరుడికి వీడ్కోలు

## పొచ్చెరలో ముగిసిన అడెల్లు అంత్యక్రియలు

బోథ్, జూన్ 9 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్‌కు సోమవారం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈనెల 6న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అడెల్లు మృతి చెందాడు. ఆయన పార్థివదేహాన్ని ఆదివారం రాత్రి తన స్వగ్రామమైన బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చేరుకుంది. సోమవారం ఉదయం 10 గంటలకు అంతిమ యాత్ర ప్రారంభం కాగా.. అమర వీరుల బంధుమిత్ర సంఘం, సీపీఐ, సీపీఎం, న్యూ డెమోక్రసీ, మాజీ మావోయిస్టులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక శ్మశాన వాటిక వద్ద దహన సంస్కారాలు పూర్తయ్యాయి.

### ఎమ్మెల్యే నివాళి

అడెల్లు మృతదేహం వద్ద బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరిట అమాయకులను పొట్టన పెట్టుకోవడం సరికాదన్నారు. అంత్యక్రియల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా సహాయం అందేలా కొట్లాడుతామన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్, రవీంద్ర ప్రసాద్ ఉన్నారు.